17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
# సూర్య
## ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 6 ఆగస్టు 2024 పేజీలు 8

## కలెక్టర్ల సదస్సులో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వెలగపూడి సచివాలయం 5వ బ్లాక్, రెండో అంతస్తులో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి కలెక్టర్ల సదస్సులో పాలనలో బాధ్యత, జవాబుదారీతనంపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం చేశారు. అదే విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విజయవంతంగా అమలుచేయడంపై సూచనలు చేశారు. 100 రోజుల ప్రణాళిక, "పేదల సేవలో" కార్యక్రమం, జీరో పావర్టీ, ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్ తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశనం చేశారు. అదే విధంగా రాష్ట ప్రగతికి సమష్టిగా పనిచేద్దామంటూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సదస్సులో పేర్కొన్నారు.




# ప్రతి నీటి బొట్టును వినియోగించుకోవాలి

## ప్రతి ఎకరాకు నీరందించడమే మన లక్ష్యం

- నదుల అనుసంధానం జరగాలి
- తక్కువ నీటి వినియోగం, ఎక్కువ దిగుబడిని ఇచ్చే పంటలను ప్రోత్సహించాలి
- అన్ని తాగునీటి ట్యాంకులను సకాలంలో నింపాలి
- రిజర్వాయర్లు చెరువులను నింపేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రిజర్వాయర్లు చెరువులను నింపేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 5 ముఖ్య నదులైన కృష్ణా, గోదావరి, పెన్నా, నాగావళి, వంశధారలున్నాయి. 35 చిన్న నదులున్నాయి. అదే విధంగా 38,422 మైనర్ ఇరిగేషన్ వనరులున్నాయి. మొత్తంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 4 కోట్ల ఎకరాల ఆయకట్టు ఉంది. రిజర్వాయర్లు, చెరువులను నింపేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుత వర్షాకాల/ వరద సీజన్‌లో ముందుగా వరద నీటిని వృథా కాకుండా మనం రిజర్వాయర్లను, చెరువులను నింపేందుకు సీఈలు, మిగతా 2లో

# విచారణకు

## నేను సిద్ధం... నీవు సిద్ధమా...

మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు సవాళ్లు విసిరిన ఎమ్మెల్యే తాతయ్య

దయ్యాలు వేదాలు వదిలించినట్లుగా మాజీ ఎమ్మెల్యే తత్వం అని ఎద్దేవా

2లో




రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా

# సర్కారు అడుగులు



- వైసీపీ పాలనలో నీటిని రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి
- ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేశారు
- ఎమ్మెల్యే సౌమ్య

2

# ప్రతి నీటి బొట్టును వినియోగించుకోవాలి





(మొదటిపేజీ తరువాయి)

ఎస్ఈలతో సమీక్షించాలి. వరద నీటిని ఒడిసిపట్టి తక్షణమే ఎగువన ఉన్న రిజర్వాయర్లను నింపాల్సిన అవసరం ఉంది. ఒక్క చుక్క నీటిని కూడా వృధా చేయకూడదు. నీరు సముద్రం పాలు కానీయకూడదు. ప్రతి నీటి బొట్టును మనం వినియోగించుకోవాలి. తక్కువ వ్యయంతో పూర్తయ్యే ఎత్తిపోతల పథకాలను పునరద్ధరించేందుకు వాటిపై సమీక్ష చేయాలన్నారు. తక్కువ నీటి వినియోగం, ఎక్కువ దిగుబడిని ఇచ్చే పంటలను ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖతో కలిసి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని టెయిల్ ఎండ్ తో పాటు నీటి పారుదల ప్రాజెక్టుల క్రింద స్థిరీకరించబడిన ప్రతి ఎకరాకు నీరు అందాలి. కాలువలకు నీటి విడుదల ప్రక్రియను కలెక్టర్లు సునిశితంగా పరిశీలించాలన్నారు. తదనుగుణంగా సకాలంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలిస్, ఆర్ డబ్ల్యూఎస్ తదితర శాఖలు పాలుపంచుకోవాలి. అన్ని తాగునీటి ట్యాంకులను సకాలంలో నింపాలి. ప్రతి ఎకరాకు నీరు అందాలి. అదే మన లక్ష్యం. గేట్లు పెట్టడానికి నిధులు ఇవ్వలేకపోయింది గత ప్రభుత్వం ఎక్కడైనా గేట్ కొట్టుకుపోతే తక్షణమే ఏఈ, డీఈని డీమ్డ్ సస్పెన్షన్ చేస్తాం. డ్రోన్ లను పెట్టి కెనాల్స్, ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి. నదుల అనుసంధానం జరగాలి. ఏ ఒక్క వ్యక్తి తప్పు చేసినా, విఫలం అయినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు.

## విచారణకు

## నేను సిద్ధం... నీవు సిద్ధమా...




**జగ్గయ్యపేట ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ కొనకంచి క్రాస్ రోడ్డు నవాబుపేట గ్రామానికి చెందిన నాయకుడి పై జరిగిన దాడి విషయంలో తమ తెలుగుదేశం పార్టీ కూడా పూర్తిస్థాయిలో ఖండిస్తుందని తెలిపారు. శనివారం రాత్రి జరిగిన ఘటనపై సీఎం ఆఫీస్ కూడా పూర్తిస్థాయిలో ఖండించడంతోపాటు ఎవరైతే దాడికి పాల్పడ్డారో వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేశారే తప్ప మీ వైకాపా ప్రభుత్వంలో లాగా దాడులు చేసిన వారిని మా ముఖ్యమంత్రి ఏ రోజు సపోర్టు చేయలేదని తెలిపారు. ఉదయభాను మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు ఆయన గవర్నమెంట్ లోనే చిట్యాల శీతారెడ్డి, మల్లారెడ్డి, ముళ్లపాడు లో నరసరావు వంటి మర్డర్ కేసుల్లో మీ హస్తం లేదా అని అన్నారు. ఇప్పటికైనా ఈ ముగ్గురు కేసులతోపాటు నవాబుపేట గింజపల్లి వీరయ్య, బుచ్చయ్య చౌదరి కేసుల్ని సిబిఐ కి ఇవ్వటానికి మేము సిద్ధంగా ఉన్నామని అదేవిధంగా మీరు సిద్ధంగా ఉంటే రావాలని పిలుపునిచ్చారు. 2024లో తెలుగుదేశం గెలుపొందిన తర్వాత దాడులు జరుగుతున్నాయని అసత్య ఆరోపణ చేసే ఉదయభానుకి 2019లో గెలిచిన రోజునే చిల్లకల్లు నుంచి ర్యాలీగా వస్తా వస్తా మా ఎస్.ఎల్.టి ట్రాన్స్పోర్ట్ కు సంబంధించిన మిల్లు పై, మా ఇంటి పై నీ సమక్షంలో దాడులు చేయలేదా అని ఎద్దేవ చేశారు. ఎన్నికలకు ముందు నా సొంత తమ్ముడుపై అసభ్యంగా మాట్లాడింది నువ్వు కాదా? అదే విధంగా బూధవాడ గ్రామానికి చెందిన ఒక కార్యకర్తను (బుజ్జిబాబు) ను కూడా బూతులు మాట్లాడిన సంఘటన మర్చి పోయావా అని విమర్శించారు. నియోజకవర్గంలో బండిపాలెం, ఇందుగుపల్లి వంటి గ్రామాల్లో మా నాయకులు పై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించింది నువ్వు కాదా అని ఆరోపించారు. నవాబుపేటలో జరిగిన సంఘటన అది కేవలం గ్రామంలో ఉన్నటువంటి పాత కక్షలతో మాత్రమే జరిగిందని అది మా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. చిట్యాల కి చెందిన మీ బావ అల్లుడు వాసుదేవ రెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బుతోనే ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేశావని ఆరోపించారు. చిట్యాల లో జరిగిన సీతారెడ్డి, మల్లారెడ్డి వంటి కేసులను అక్రమంగా సంపాదించిన డబ్బుతో పాటు అధికారం అడ్డుపెట్టుకొని కేసులు తీయించుకున్న ఘనత నీదేనని ఆరోపించారు. మర్డర్లు చేసే ఘనత,అక్రమ కేసులు బనాయించే ఘనత నీకే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా నీ పద్ధతి మార్చుకోవాలని లేకపోతే చట్టప్రకారంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీ తండ్రి హయాంలో బూదవాడలో మునుసూబ్ హత్య చేయించిన ఘనత మీది కాదా అని ఆరోపించారు. నవాబుపేట గుంజుపల్లి వీరయ్య కేసులో మా తమ్ముడు వెహికల్(వాహనము) ఉపయోగించారని అక్రమంగా కేసు పెట్టారు దీనిపై సిఐడి వాళ్లు ఎంక్వయిరీ చేసి ఆ వెహికల్ ఇన్వాల్వ్ చేయలేదని తేలడంతో కొట్టివేశారని చెప్పారు. ఎప్పటికైనా నీకు దమ్ము ధైర్యం ఉంటే సిబిఐ గాని సిఐడికి గాని అప్పగించాలని ఒక లాయర్ ద్వారా లెటర్ పూర్వకంగా రాసిఇచ్చే దమ్ము నీకు ఉందా అని మండిపడ్డారు.

## రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా

# సర్కారు అడుగులు



**కంచికచర్ల, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా కూటమి సర్కారు శరవేగంగా అడుగులు వేస్తోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. విభజన గాయాల నుంచి కోలుకునే దశలో మాజీ సీఎం జగన్ చేసిన విధ్వంసం నుంచి బయటపడడానికి కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు సర్వశక్తులూ ఒడ్డుతున్నారని పేర్కొన్నారు. సోమవారం కంచికచర్ల మండలం గండేపల్లిలో కీసర ఎత్తిపోతల పథకం పను లను ప్రారంభించారు. స్థానిక సెంతిని సంస్థ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులకు 25 లక్షల రూపాయలను అందించడం అభినందనీయమని అన్నారు. అంతేకాకుండా కేసర నుండి గండేపల్లి వరకు ఉన్న రోడ్డుని అభివృద్ధి చేయట కొరకు ముందుకొచ్చిన సెంటిని యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందన అభినందిస్తున్నట్లు అదేవిధంగా ప్రభుత్వం నుండి తప్పనిసరిగా సహకారం కంపెనీకి కూడా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో స్కీం అభివృద్ధికి రైతు నాయకులు మందడపు పేరయ్య రైతులు తోడ్పడ్డారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత పాలకులు కనీస పనులు కూడా చేయకుండా మోటార్లను ధ్వంసం చేసి ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారని ఈ సందర్భంగా వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యానికి కారణం నాటి వైఎస్ జగనేనని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మండిపడ్డారు. ఇది ఏమైనా కూటమి ప్రభుత్వం మంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ ఏపీకి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేలా పనులను పరుగులు పెట్టిస్తున్నారని రైతుల హర్షద్వానాల మధ్య మధ్య సౌమ్య వ్యక్తం చేశారు. అధికారులు, కూటమి నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# అవనిగడ్డకు రెండవ డంపింగ్ యార్డా ?





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అవనిగడ్డలో మరో డంపింగ్ యార్డ్ తలపించేలా పులిగడ్డ ఎత్తిపోతల పథకం సమీపంలో పంట కాలువ గట్టుపై తాగి పారేసిన కొబ్బరి బొండాలు,చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. ఇప్పటికే అవనిగడ్డ, నాగాయలంక ప్రధాన రహదారిలో అవనిజ పెట్రోల్ బంక్ సమీపంలో పెద్ద ఎత్తున డంపింగ్ యార్డ్‌కు చెత్తా, చెదారం తరలిస్తున్నారు. ఈ తరుణంలో పులిగడ్డ ఎత్తిపోతల పథకం సమీపంలో అవనిగడ్డ, పులిగడ్డ ప్రధాన పంట కాలువ గట్టుపై చెత్త పేరుకుపోతుంది. దీనితో బిసి కాలనీ వాసులు ఇక్కడ మరో డంపింగ్ యార్డ్‌ను తయారు చేస్తారా అని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తాగి పారేసిన కొబ్బరి బొండాలు, చెత్తను తొలగించి శుభ్రం చేసి ఈ ప్రాంతం వాసులకు ఏ విధమైన వ్యాధులు రాకుండా చూడాలని పంచాయితీ వారిని కోరుతున్నారు.



### సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా

## కాలవలు బాగు చేయాలి..!

**కోడూరు మేజర్ న్యూస్ :** సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా కాలవలు బాగు చేయాలని కోడూరు మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు కోరారు. సోమవారం కోడూరు ఈస్ట్ ఛానల్ 11 నెంబర్ పంట కాలవ పూడిక తీత పనులను స్థానిక టిడిపి జనసేన నేతలతో కలిపి ఆయన పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కృషి తోనే కాలవ మరమ్మత్తులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, మేడా శివాజీ, పిల్లి మల్లికార్జునరావు, వేములపల్లి శ్రీకృష్ణ, గోగినేని సోమశేఖర రావు బండే వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

### పిట్టలంకలో గత కొద్ది రోజులుగా

## అక్రమ ఇసుక రవాణా..!





**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండల పరిధి పిట్టలంక గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానది నుంచి ఇసుకను తవ్వి పలువురు అక్రమ రవాణా చేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ అక్రమ రవాణా కొనసాగుతుందని గ్రామస్థులు వాపోతున్నారు.

## అక్రమ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్




**కోడూరు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పిట్టలంక కృష్ణా నదిలో నుండి పడవల ద్వారా ఇసుకను ఒడ్డుకు చేర్చి అక్కడనుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని సమాచారంతో కోడూరు పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ను సీజేశారు. పట్టుకున్న టాక్టర్ను స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఏఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాలు ప్రకారం పిట్టాలంక కృష్ణా నది నుండి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్నారని సమాచారంతో దాడులు నిర్వహించి ఒక టాక్టర్ను పట్టుకోవడం జరిగిందని, ముగ్గురు మీద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆలయాల్లో రామనవాస మహోత్సవాలు



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం రామానవాస మహోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. పల్లగిరి గట్టు పై ఉన్న త్రిశక్తి పీఠం కనకదుర్గ కనకమహాలక్ష్మి జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాల్లో త్రీమాతలకు ప్రత్యేక అలం కరణ విశేష పూజలు జరిగాయి. దామలూరు సంగమేశ్వరస్వామి ఆలయం, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవార్లకు కుంకు మార్చన పూజలు జరిగాయి, నందిగామ పట్టణం శ్రీ వాసవి కన్యకా పరమే శ్వరి దేవి శ్రీ చక్ర మందిరం, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ మరిడి మహా లక్ష్మి అమ్మవారి దేవాలయాలలో శ్రావణమాసంలో భాగంగా మొదటి రోజు సోమవారం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు కుంకుమ మార్చనలు నిర్వహించారు.

## బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరు వారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, శుక్ల పక్షం, పాడ్యమి తిధిని పురస్కరించుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారిని కృష్ణానదీ జలాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు గోత్రనామాలతో పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో గల గణపతి కుమారస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి వారి పుట్టలో పాలు పోసి పూలు, పండ్లతో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

## ముగియనున్న జనసేన క్రియాశీలక సభ్యత్వం



**కోడూరు, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు సోమవారం రాత్రి 8 గంటలకు ముగుస్తుందని జనసేన పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి తెలిపారు. ఇంకా ఎవరైనా సభ్యత్వం పొందాలనే ఆసక్తి కలిగిన వారు ఉంటే నాగాయలంక మెయిన్ సెంటరులోని వీఎం రంగా విగ్రహం పక్కన ఉన్న సభ్యత్వ శిబిరం వద్దకు రావాలని కోరారు. లేదా ఫోన్ ద్వారా సంప్రదించగలరని సూచించారు.

## పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మచిలీపట్నంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ఇనగుదురుపేటలోని అ ర్మాన్ రెసిడెన్సి లో ఏర్పా టుచేసిన ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారం భించారు. తొలుత ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య శిబిరం నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. పివిఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పిటల్ మచిలీపట్నం ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని ఆయన సందర్భంగా కోరారు. అలాగే మచిలీపట్నంలో ఈ వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పువ్వాడ రామకృష్ణ, డాక్టర్ పాతూరు వెంక టరామ చౌదరి డాక్టర్ వినయ్ డాక్టర్ సల్మా సుల్తానా తదితర వైద్యులు వైద్య సేవలు అందించారు. రోగులను పరిశీలించి అవసరమైన వారికి టుడే ఎక్కువ ఈసీజీ షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. అనంతరం మందులను అందజేశారు.

## బాలల అవసరాలు తీర్చిన మైత్రీ ఫౌండేషన్




మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : సోమవారం మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు బొడావుల శ్రీనివాసరావు కుమారుడు అమిత్ కృష్ణ పుట్టినరోజు సందర్భగా పోర్ట్ రోడ్డులో గల శిశు గృహ కేంద్రంలో ఉండే పసిపిల్లల కోసం పౌష్టికాహార కిట్స్, అవసరమైన వస్తువుల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఘంటశాల మండలం ఎండకుదురు గ్రామ వాస్తవ్యులు సిద్దినేని రామాంజనేయులు కూడా సహకారం అందించారు. ఇరువురు దాతలకు మైత్రీ ఫౌండేషన్ తరపున హృదయ పూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పర్యటించి మానవీయ కోణంలో స్పందించాలి






**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** నేటి కలెక్టర్ల సదస్సు రాష్ట్ర అభివృద్ధికి నాంది పలకాలని, క్షేత్ర స్థాయిలో పర్యటించి మానవీయ కోణంలో స్పందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాథమిక రంగమైన వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, సంక్షేమ రంగం, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి హామీ, జలవనరులు గృహ నిర్మాణం, పౌరసరఫరాలు, పరిశ్రమలు, ఎక్సైజ్ చేనేత జౌళి పర్యాటక శాఖలు శాంతిభద్రతలు తదితర అంశాల లో రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. నగరంలోని కలెక్టరేట్ విసి హాల్ నుండి సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి,జిల్లా ఉద్యాన అధికారి జే జ్యోతి, డీఎఫ్ఓ రాజశేఖర్, జిల్లా గనుల శాఖ అధికారి కొండారెడ్డి, డ్వామా పిడి సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ్ కుమారి, డిఎస్ఓ పార్వతి, డిఇఓ తహేరా సుల్తానా, పౌర సరఫరాల డిఎం సతీష్, జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి సువర్ణ, డి ఎం అండ్ హెచ్ ఓ గీతా బాయి, ఆర్అండ్ బీ ఈఈ శ్రీనివాసరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దూర విద్యా విధానం అందిస్తున్న కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



### జిల్లా రెవెన్యూ అధికారి ఇన్చార్జి శ్రీదేవి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా అందిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఇన్చార్జి శ్రీదేవి అధికారులకు సూచించారు. సోమవారం డిఆర్ఓ చాంబర్స్ లో విద్యాశాఖ సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పెంపునకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో ఉద్యోగులు పదోన్నతుల కోసం పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు చేయ డానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కావున వారి వారి శాఖలలో అవసరమైన ఉద్యో గులకు ఈ కోర్సుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అధికారులు, ఉద్యోగులు వారికి తెలిసిన వారికి ఈ సమాచారం అందించి ఈ కోర్సులలో ప్రవేశాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ జిల్లా పరీక్షల నిర్వహణ విభాగం అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు ఈ సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి విద్యార్హత లేకున్నా 14 సం. నిండిన వారు పదవ తరగతిలో ప్రవేశానికి అర్హులని, 10వ తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్ కోర్సు చేయడానికి అర్హులని తెలిపారు.

మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు ఇదొక చక్కని సదవకాశం అన్నారు. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడతాయన్నారు. ఈనెల 28 వ తేదీలోగా నిర్దేశించిన కోర్సు రుసుం చెల్లించి పదవ తరగతి, ఇంటర్మీ డియట్లో ప్రవేశాలు పొందవచ్చని, 200 రూపాయల ఫైన్‌తో సెప్టెంబర్ 4 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ

**జగ్గయ్యపేట ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేయడం జరిగింది. కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ పట్టణంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని సిపిఎం పార్టీ మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కేరళలోని వరదల వలన ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, ఇటువంటి సంఘటన జరగటం దురదృష్టకరమని బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్పందించి విరాళాలు అందజేసి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రామనాథం, షేక్ గౌస్ మయా, కోటా రవికుమార్, వి వి రాంప్రసాద్, రావెళ్ళ శేషు, దాసరి నాగేశ్వరరావు, భూశమ్మ, బాలు, ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి దాతలు విరాళాలు



**వత్సవాయి ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** మండలంలో మక్కపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ఆళావతు పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు గుగులోతు స్వామి రూ.10,116లు, బాణావతు నాగమ్మ కుమారుడు సత్యనారాయణ రూ.10,116లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావుకు విరాళాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. దాతలు ఇచ్చిన నగదుని బ్యాంక్ లో డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీతో పాఠశాలను మరింత అభివృద్ధి చేసి జిల్లాలోనే మన పాఠశాలను ముందు వరసలో ఉంచుతామని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఈ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తారని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి నా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజ్మీరు శ్రీనివాసరావు, పిడివి ప్రసాదరావు గుగులోతు కోటయ్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మీకోసంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ




**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** సమస్యతో వచ్చిన బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యపై తప్పక న్యాయం చేస్తామనే నమ్మకాన్ని వారిలో కలిగించాలని జిల్లా ఇంచార్జ్ అడిషనల్ ఎస్పి (అడ్మిన్) ఎస్ వి డి ప్రసాద్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం" కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వద్ద నుండి జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆదేశాల మేరకు ఫిర్యాదుల స్వీకరించారు. ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఫిర్యాదుల స్వీకరించి మీ సమస్యకు పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## గీతామందిరంలో శ్రావణమాసోత్సవం ప్రారంభం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గీతా మందిరంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా రాజ్యలక్ష్మీ అమ్మ వారికి శ్రావణమాసోత్సవ పూజలు వైభవంగా ప్రారంభించారు. గీతా మందిరంలో వేంచేసి ఉన్న రాజ్య లక్ష్మీ అమ్మవారికి సోమవారం విశేష అభిషేకాలు అర్చనలు, పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకస్వామి దివి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాల తో అభిషేకాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనం తరం అమ్మవారికి విశేషంగా శ్రీలక్ష్మీ సహస్ర నామాలతో కుంకుమ అర్చన లు జరగగా లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, సామూహికంగా మ హిళలు పఠనం చేశారు. విశేష అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని పెద్ద సంఖ్యల్లో భక్తులు దర్శించుకున్నారు. అర్చక స్వామి భక్తులకు తీర్ధ ప్రసాదాలను వితరణ చేయగా మందిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరి బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అపురూపమైన చిత్రపటం మండలికి బహుకరణ



**అవనిగడ్డ మేజర్ న్యూస్:** దివిసీమ గాంధీ, సర్గీయ మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతిని పురస్కరించుకుని గాంధీక్షేత్రంలో అవనిగడ్డ జనసేన పార్టీ నాయకులు గాజుల పోతురాజు అపురూపమైన చిత్రపటాన్ని శాసనసభ్యులు మండలి బుద్దప్రసాద్, తనయుడు మండలి వెంకట్రామ్‌కు బహుకరించారు. మండలి వారి వంశంలో మూడు తరాల ముఖ్య నాయకులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు, అవనిగడ్డ శాసనసభ్యులు, ఏపి అసెంబ్లీ తొలి డిప్యూటీ స్పీకర్, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి బుద్దప్రసాద్, యువనాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్‌లు కలిసి ఉన్న చిత్రపటాన్ని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి చేతుల మీదుగా మండలి బుద్దప్రసాద్, వెంకట్రామ్‌లకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో గాజుల పోతురాజు మిత్రబృందం, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ముడిసరుకుపై జీఎస్టీ గురించి కేంద్ర ఆర్థిక మంత్రిని ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఎరువుల ముడి సరుకుపై జిఎస్‌టి గురించి పార్ల మెంట్ సమావేశాలలో కేంద్ర ఆర్థిక మంత్రిని ఎంపీ బాలశౌరి ప్రశ్నించారని మచిలీపట్నం ఎంపీ కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల ముడిసరుకుపై జిఎస్‌టిని ప్రభుత్వం తగ్గించాల్సిన పరిమితుల వివరాలు జిఎస్‌టి కౌన్సిల్ ఈ అంశంపై చాలాసార్లు చర్చించినా ఎలాంటి నిర్ణయం తీసుకోలే దన్నది నిజం కాదా, అలా అయితే, దాని వివరాలు, పార్లమెంట్‌లోని రసాయనాలు ఎరువుల స్టాండింగ్ కమిటీ కూడా ఎరువుల ముడిసరుకుపై జిఎస్‌టి 18% నుండి 5%కి తగ్గించాలని సిఫా రసు చేసిందనేది నిజమేనా, అలా అయితే, దాని వివరాలు, జిఎస్‌టి కౌన్సిల్ ఈ సమస్యను మంత్రుల బృందానికి ఫార్వార్డ్ చేసిందనేది నిజమేనా, అలా అయితే, మంత్రుల బృందం యొక్క ఫలితాలు, ఫలితాలతో పాటు దాని వివరాలను తెలియజేయండని ప్రశ్నించడం జరిగిందన్నారు.

## రైతుల శ్రేయస్సే అండగా కూటమి ప్రభుత్వ లక్ష్యం



**జగ్గయ్యపేట ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** రైతులకు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం ఉంటుందని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో గ్రామ నాయకులు, విఆర్‌ఓ షేక్ హుస్సేన్ తో కలిసి గ్రామ రైతులకు కౌలు రైతు కార్డులను అందజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిరుదుగడ్డ రాజారావు అంతిమయాత్రలో శ్రీరాం చినబాబు



**జగ్గయ్యపేట ఆగష్టు 05 మేజర్ న్యూస్ :** పట్టణ ప్రాంత ప్రజలకు లెప్రసీ డాక్టర్ గా సుపరిచితులైన ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ బిరుదు గడ్డ రాజారావు ఆదివారం పట్టణంలో ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకొని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ సోదరుడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు యువ నాయకులు శ్రీరాం ధనుంజయ (చినబాబు) సోమవారం నాడు రాజారావు అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసి నివాళులు అర్పించారు.

## దాతల సహాయం ఆదర్శనీయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** వృద్ధాశ్రమాలకు దాతల సహాయం ఆదర్శనీయమని చల్లపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు మోర్ల రాంబాబు అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అగ్రహారానికి చెందిన ప్రముఖ అర్చకులు వేమూరి శ్రీనివాస శర్మ (శీనాయ్) కుమారుడు స్వర్గీయ వేమూరి రేవంత్ స్మృతిలో రేవంత్ బాబాయి వేమూరి సత్యనారాయణ శర్మ, కుటుంబ సభ్యులు కలిసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి నా సహకారం ఎప్పుడూ ఉంటుంది

**సమాజంలో పత్రిక రంగాన్ని కొందరు దిగజారుస్తున్నారు**

**యాజమాన్యాలతో పని లేకుండా సొంతగా ఛానల్స్ పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు**

**మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**

**ఏపీఎంపిఏ సర్వసభ్య సమావేశం విజయవంతం**




**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** జర్నలిస్టుల సంక్షేమానికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందనీ, అయితే సమాజంలో పత్రిక రంగాన్ని కొందరు దిగజారుస్తున్నారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరం నియోజకవర్గ కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్ లో సోమవారం ఏపీఎంపిఏ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆత్మీయ అతిథులుగా ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘు రాంతో పాటు మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఏపిఎంపిఏ రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏపిఎంపిఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నే సోమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లి కార్జునరావు, కోశాధికారి మత్తి శ్రీకాంత్, జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, ఏపీఎంపిఏ విజయవాడ నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుపులేటి చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. సమాజంలో పాత్రికే యులు పత్రికా రంగం విలువలు కాపాడాలని తెలిపారు పత్రికలు, రాజకీ యాలు ఇలా అన్ని రంగాలలో విపరీతమైన దుందుడుకు తత్వం ఏర్పడిం దన్నారు. సమాజంలో జరుగుతున్న లోటుపాట్లను ఎత్తి సోపాల్సిన పత్రిక రంగాన్ని కొందరు దిగజార్చడం బాధాకరమన్నారు. యాజమాన్యాలతో పని లేకుండా నేడు సొంతగా సోషల్ మీడియా,యూట్యూబ్ ఛానల్స్ ప్రింట్ చేయకుండా పి డి ఎఫ్ లు పెట్టి బ్లాక్ మెయిల్ లకు పాల్పడుతు న్నారని ఆరోపించారు. ఇలాంటివారిని ఏపీఎంపిఏ లో చేర్చుకోవద్దని, అసోసియేషన్ లో నిజమైన విలేకరులకే సభ్యత్వం కల్పించండని రాష్ట్ర నాయక త్వానికి సూచించారు. నేడు కుల, పార్టీల పరంగా పత్రికలు పుట్టుకొచ్చాయన్నారు మీడియాలో పెడధోరణితో వ్యవహరించే జర్నలిస్టుల యూనియన్లు నియంత్రిం చాలన్నారు. ఈ విషయంలో తనను అన్యధా భావించవద్దన్నారు. తనను అపార్థం చేసుకోకుండా ఒక ఎమ్మెల్యేగా కాకుండా మీ సోదరునిలా భావించి వాస్తవాలను గ్రహించా లని విజ్ఞప్తి చేశారు. అయితే చాలా మంది పాత్రికేయులు అంకిత భావంతో పని చేస్తున్నారని అభినందించారు. అన్ని రంగాల్లోను,అన్ని వర్గాలవారిని చైతన్య పరుస్తూ ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పాత్రికేయులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. నిజాన్ని నిర్భయంగా చాటి చెప్పే మీడియా సోదరులకు అభినందనలు తెలిపారు. మైలవరం నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రజాప్రతిని ధులు, రాజకీయ నాయకులు,పాత్రికేయులు కలిసి పనిచేద్దామన్నారు. మైలవ రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. తాను చేయగలిగింది చెబుతాననీ, లేదంటే నా వల్ల కాదని చెబుతానని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నెట్టెం రఘురాం హామీ ఇచ్చారు. అక్కల గాంధీ మాట్లాడుతూ గతంలో ఎంతో మంది పాత్రికేయులకు స్థలాలు ఇవ్వడం జరిగిందని, ఎన్డీఏ కోటమీ ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేయనున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సమస్యలను డిప్యూటీ సీఎం ప వన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అక్కల గాంధీ తెలిపారు. ఈ సమావే శానికి హాజరైన ఎమ్మెల్యేతో పాటు ఆత్మీయ అతి థులను ఏపీఎంపిఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మైలవరం ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, జిల్లా నలుమూలల నుంచి ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా పాత్రికేయ పాల్గొన్నారు.

# శ్రీ సత్యమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** మండలం లోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం హుండీలను నందిగామ డివిజన్ దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పి. ఫణి కుమార్ పర్యవేక్షణలో, దుర్గ శివ సాయి సేవాదళ్ సభ్యుల సమక్షంలో తెరచి లెక్కించారు. 39 రోజులకు గాను మొత్తం 6,01,670/- రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. సీతారామయ్య ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సీడిపై ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రైతులకు ప్రభుత్వం అందించే సబ్సీడిలను వినియోగించుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎన్ రమేష్ రైతులకు తెలిపారు. సోమవారం రమేష్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సీడి వివరాలను తెలియచేశారు. బిందు సేద్యం, తుంపర్ల సేద్యంపై రాయితీలను రైతు సోదరులకు వివరిస్తూ ఉద్యాన శాఖ ద్వారా ఎపిఎంఐపి ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఒకటి నుండి ఐదు ఎకరాలు ఉన్న రైతులకు 90 శాతం సబ్సీడి, 5 నుండి 12 ఎకరాలు ఉన్న రైతులకు 50 శాతం సబ్సీడి డ్రిప్ సాగుపై అందించడం జరుగుతుందని స్ప్రింకర్ల ద్వారా వ్యవసాయం చేసే రైతులకు ఒకటి నుండి ఐదు ఎకరాలు ఉన్న రైతు సోదరులకు 55 శాతం సబ్సీడి, 5 నుండి 12 ఎకరాలు ఉన్న రైతులకు 45 శాతం సబ్సీడి అందించనున్నట్లు చెప్పారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ కాపీ, ఐబి, ఎఫ్.ఎం.బి జిరాక్స్ కాపీలతో దగ్గరలోని ఐఎఎ గానీ, విహెచ్ఎ ను కానీ సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ తోటల్లో బిందు సేద్యం యొక్క ఉపయోగాలను వివరిస్తూ నీటి వినియోగ సామర్థ్యం 95 శాతం పెరిగి కలుపు మొక్కల సమస్య తగ్గుతుందని, నీటి కొరత లేకపోవడం వలన ఆడగెలలు ఎక్కువగా వచ్చి తద్వారా దిగుబడి ఎకరానికి 1 టన్ను వరకు పెరుగుతుందన్నారు. నేల ఎల్లప్పుడూ తేమగా ఉండటం వలన తోటలో మైక్రో క్రైమెట్ పంటకు అనుకూలంగా ఉండి, అంతర పంట సాగుకు అనుకూలం అవుతుందన్నారు. అధిక లవణాలు ఉన్న నీటిని కూడా సాగుకు ఉపయోగించవచ్చని, ఎగుడు దిగుడు నేలలో కూడా నీటి యాజమాన్యాన్ని మెరుగ్గా సాగించవచ్చన్నారు.

**ఫెర్టిగేషన్ వల్ల ఉపయోగాలు**

ఫెర్టిగేషన్ ద్వారా మొక్కలకు ఎరువులను అందించడం వలన ఎరువు నేరుగా మొక్క వేరుకు చేరుకుంటుందని, తక్కువ సమయంలోనే మొక్కలకు ఎరువు అందించవచ్చని, మొక్కలకు ఎరువు వేయుటకు అయ్యే కూలీ ఖర్చు 3,500 నుండి 4000 రూ॥ వరకు తగ్గుతుందన్నారు. ఫెర్టిగేషన్ పద్ధతిలో మొక్కలకు ఎరువులను అందించినట్లయితే ఎరువుల మోతాదు కూడా సగానికి తగ్గి, ఎరువుల ఖర్చులో ఎకరానికి 2 వేల నుండి 2,500 రూపాయల వరకు తగ్గుతుందని, ఎరువులు సూర్యరశ్మికి ఆవిరి అయ్యే అవకాశం లేదని ఫెర్టిగేషన్ ద్వారా నీరు, ఎరువుల తోటలోని ప్రతి మొక్కకి సమానంగా అందడం వలన మొక్కల పెరుగుదల సమంగా ఉంటుందని ఫెర్టిగేషన్‌తో పాటు యాజమాన్య పద్ధతి పాటిస్తే దిగుబడి ఎకరానికి 2 నుండి 3 టన్నుల వరకు పెరుగుతుందని, రైతులు ప్రభుత్వం అందించే సబ్సీడిని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని రమేష్ అన్నారు.

# గత ప్రభుత్వం వ్యవస్థలను ఆటబొమ్మలుగా మార్చింది

**వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా కూటమి పాలన**

**ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని, బాధలు తట్టుకొని ప్రభుత్వాన్ని స్థాపించాం**

**ప్రజల నమ్మకానికి న్యాయం చేస్తాం**

**రాష్ట్ర ప్రగతి కోసం సమష్టిగా పని చేద్దాం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, పాలన దక్షతతో రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొద్దాము**

**సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** '164 శాసనసభ స్థానాలు... 21 లోక్ సభ స్థానాలు... 93 శాతం స్ట్రయికింగ్ రేట్ తో ఎన్డీఏ కూటమిని ప్రజలు ఆశీర్వదించారు. వారు మనపై పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేయాల'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని, వ్యవస్థలను బతికించాలనే ఉద్దేశంతోనే అన్నీ తట్టుకొని నిలబడ్డామన్నారు. బలోపేతమైన వ్యవస్థలను గత ప్రభుత్వం ఆటబొమ్మలుగా మార్చిందని చెప్పారు. అత్యుత్తమ పాలనలో ఒకప్పుడు మోడల్ గా ఉన్న రాష్ట్రం... గత ఐదేళ్ల పాలనలో ఎంత దారుణంగా దిగజారి పోయిందో చూశామనీ, గత పాలకుల విధానాల వల్ల పాలన ఎలా ఉండకూడదు అనే విషయానికి రాష్ట్రం మోడల్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన రాష్ట్రంలో పనిచేయడానికి పోటీ పడేవారని, మళ్లీ అలాంటి పరిస్థితి తీసుకొద్దామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, పాలన దక్షతతో రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొద్దామని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "వ్యవస్థలను బలోపేతం చేయాలని రాజకీయాల్లోకి వచ్చాం. మేము ఈసారి అధికారంలోకి రాకపోయినా ప్రజాస్వామ్యంలో నిలబడి వ్యవస్థను బలోపేతం అయ్యేలా చేసేవాళ్లం. దేవుడి దయవల్ల అధికారంలోకి వచ్చాం. మాది మంచి ప్రభుత్వం.. జవాబుదారీతనం ఉన్న ప్రభుత్వం.

**పంచాయతీల బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నాం**

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా, అటవీశాఖ, శాస్త్రసాంకేతిక శాఖలను తీసుకున్నాను. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రిజల్యూషన్ చేస్తున్నాం. తద్వారా పంచాయతీలను బలోపేతం చేస్తాం. గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అమలు చేస్తున్నాం. పిఠాపురం నియోజకవర్గంలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. జలజీవన్ మిషన్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 5.4 కోట్ల గృహాలకు తాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కొత్త రోడ్లు, ఉన్న రోడ్లు బాగు చేయడం మా ప్రభుత్వ లక్ష్యం. ఈ ఆర్థిక సంవత్సరంలో 4721 కిలోమీటర్ల రోడ్లను మరమ్మత్తు చేయాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 29.23 శాతం 37,400 చదరపు కిలోమీటర్ల నోటీఫై చేసిన అడవులు ఉన్నాయి. నోటిఫై చేసిన అటవీ పరిధికి అదనంగా 10,221 చదరపు కిలోమీటర్ల గ్రీన్ కారిడార్ ఉంది. చెరువు తీరాలు, ఇనిస్టిట్యూషన్ ల్యాండ్స్, పంచాయతీ ల్యాండ్స్ లో కూడా అటవీకరణను ప్రోత్సహించాల్సి ఉంది. గుంటూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అటవీ పరిధి తక్కువగా ఉంది. ఇక్కడ అడవులు పెంచేందుకు కృషి చేయాల్సి ఉంది.

**వికసిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అందరి సహకారం అవసరం**

'రాజ్యాంగం ఎంత గొప్పగా ఉన్నా.. దాన్ని అమలు పరిచేవారు సరిగా లేకపోతే ఆ వ్యవస్థ పని చేయదు. బలహీనమైన రాజ్యాంగం ఉన్నా ప్రజల కోసం పని చేసేవారు ఉంటే ఆ వ్యవస్థ కచ్చితంగా పనిచేస్తుందని డాక్టర్ అంబేద్కర్ చెప్పారు. గత ప్రభుత్వంలో వ్యవస్థలను ఎలా చిద్రం చేశారో మనం చూశాం. పాలన అనుభవం ఉన్న వ్యక్తి చంద్రబాబు నాయుడు, నేర్చుకోవాలనుకునే తపన ఉన్న నాలాంటి వ్యక్తి, పాలన అనుభవం ఉన్న మంత్రి వర్గ సహచరులు కలిసి వ్యవస్థలను ముందుకు తీసుకువెళతాం. చంద్రబాబు నాయుడు విజన్‌ను తాము ముందుకు తీసుకువెళతాం. విభజన ముందు 20 ఏళ్ల పాటు అవమానాలు.. ఇబ్బందులుపడ్డాం.

**రాష్ట్రంలోకి అనుమతించని పరిస్థితి**

రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటి వరకు మనం నలుగుతూనే ఉన్నాం. గత ప్రభుత్వంలో బోర్డర్ దాటి రాష్ట్రంలోకి రావడానికి కూడా అనుమతించని పరిస్థితి. అన్నింటినీ దాటుకుని ముందుకు వచ్చాం. పరిపాలనలో ఒక అడుగు ముందుకు పడాలి తప్ప వెనక్కి వెళ్ల కూడదు. రాష్ట్ర అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం. 2047లో భారత్ సూపర్ పవర్ కావాలన్నా, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం పూర్తి కావాలన్నా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సహకారం అవసరం" అన్నారు.

# భూ వివాద అర్జీలు 10 నుంచి 50 శాతానికి పెరిగాయి

**ఒక్కసారిగా ఇలా పెరిగాయంటే గత ఐదేళ్లలో ఏదో తప్పు జరిగింది**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే కలెక్టర్ల ప్రథమ కర్తవ్యం**

**రెవెన్యూ కార్యాలయాల భద్రతపై దృష్టి పెట్టండి**

**స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా**


**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వానికి ప్రజల నుంచీ వచ్చే అర్జీల్లో గతంలో కేవలం 10 శాతం మాత్రమే భూ వివాదాలకు సంబంధించి ఉండేవని, అయితే ఇప్పుడు అనూహ్యంగా ఆ అర్జీలు 50 శాతంపైగా పెరిగాయని, అంటే గత ఐదేళ్లలో ఏదో జరిగిందనే అనుమానాలు కలుగుతున్నాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్నారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అందుతున్న ఈ భూ వివాదాల అర్జీల పరిష్కారానికి కలెక్టర్లందరూ మొదటి ప్రాధాన్యమివ్వాలని కోరారు. గత ఐదేళ్ల లో తమ భూమిని కబ్జా చేశారని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారనే ఫిర్యా దులు ప్రభుత్వానికి కుప్పలు తెప్పలుగా వస్తున్నాయని చెప్పారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో భూ వివాద సంబంధిత ఫిర్యాదులు, అర్జీలు వచ్చేవి కావని తెలిపారు. అంటే గత ఐదేళ్లలో ఏదో తప్పు జరిగిందనే అభిప్రాయం ఇది కలిగిస్తోందని, ఇప్పుడు ఆ ఫిర్యాదులన్నీ పరిష్కరించాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. చాలా చోట్ల అసైన్డ్ భూములు, ఇనామ్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయి, చాలా చోట్లడి పట్టాలను కూడా గిఫ్ట్‌గా ఇచ్చేశారని వీటన్నిటిపైనా విచారణ జరిపి రికార్డులు పునః పరిశీలించాలన్నారు. తిరుపతి, చిత్తూరు, వైయస్సార్ కడప, అన్నమయ్య, ప్రకాశం, సత్యసాయి జిల్లాల్లో ఇలాంటి వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ జిల్లాల్లో భూ వివాదాలు పరిష్కరించడానికి డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో ఒక కమిటీ వేసి పరిష్కరించాలన్నారు. ముందుగా ఈ జిల్లాల్లో ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని ఈ కమిటీ అక్కడ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఈ ఫిర్యాదులను పరిష్కరించాలని, నెల రోజుల్లోపు ఇది పూర్తీ కావాలని ఆదేశించారు.

**అర్జీలపై ఉదాసీనత వద్దు**

జిల్లా కలెక్టర్లపైన ఎంతో నమ్మకంతో ప్రజలు అర్జీలు ఇవ్వడానికి వస్తారని, వాటి పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యంగా కలెక్టర్లు పనిచేయాలని కోరారు. జిల్లా కలెక్టర్లే ప్రభుత్వ పనితీరుకు ప్రతీకగా నిలుస్తారని చెప్పారు. ప్రజలిచ్చే ఫిర్యాదులు పరిష్కరించకుండా ఉదాసీనత ప్రదర్శిస్తే వారిలో ప్రభుత్వం పట్ల నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించనప్పుడే ప్రజలు సచివాలయానికి, ప్రజా ప్రతినిధులు, మంత్రుల చుట్టూ తమ సమస్య పరిష్కారం కోసం ప్రదక్షిణలు చేస్తుంటారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్ని ప్రమాద సంఘటన రెవెన్యూ కార్యాలయాల వద్ద భద్రతా వైఫల్యాలను తెలియజేసిందన్నారు. అక్కడ 56 సంవత్సరాల వీఆర్ ఏను రాత్రి పూట కాపలా ఉంచారని, అలాగే సీసీ కెమరాలు కూడా పనిచేయలేదన్నారు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ఈ భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసే దిశగా కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంత్రి కొలుసు పార్థసారథి**



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి సమాచార, పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే సమావేశానికి హాజరు కాలేకపోవడానికి కారణం తెలుపుతూ తమ సందేశాన్ని మెసేజ్ ద్వారా ఏపిఎంపిఏ రాష్ట్ర నాయకత్వానికి తెలియజేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జర్నలిస్టులకు మంత్రి శుభాభినందనలు తెలియజేశారు. మైలవరంలో సోమవారం జరుగుతున్న జర్నలిస్టుల సమావేశానికి హాజరు కావలసి ఉన్నప్పటికీ అత్యవసరంగా ముఖ్యమంత్రి కలెక్టర్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయటం వలన నేను ఈసమావేశానికి ప్రత్యక్షంగా హాజరు కాలేకపోవటం జరిగింది. జర్నలిస్టు సోదరులు అన్యథ భావించవద్దని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం జర్నలిస్టు సోదరుల సంక్షేమా నికి కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే జర్నలిస్టు లకు హెల్త్ కార్డ్స్ మంజూరుకు చర్యలు తీసుకున్నామనీ, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల మంజూరు చేయడంతో పాటు గృహనిర్మాణం కూడా చేపట్టేందుకు ఇటీవల జరిగిన గృహ నిర్మాణ శాఖ సమీక్షా సమావేశం లో తగు నిర్యయం తీసుకోవటం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టు సోదరులు అక్రిడిటేషన్ కోసం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నా రు. ఈ పర్యాయం ఏవిధమైన ఇబ్బంది లు లేకుండా అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేసేందు కు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమాచార శాఖ మంత్రి గా నేను ఎప్పుడు జర్నలిస్టుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి కృషిచేస్తానంటూ మంత్రి పార్థసారథి తమ సందేశంలో పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి సాయం చేయడంలో ఐ అండ్ పీఆర్ ప్రముఖ పాత్ర

**సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. గుడ్ గవర్నెన్స్‌లో ప్రభుత్వానికి సాయం చేయడంలో ఐ అండ్ పీఆర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను, నిర్ణయాలను, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వాటిపై సంపూర్ణ అవగాహన కల్పించడంలో ఉపయోగపడుతుందన్నారు. అలాగే జిల్లాల్లో జరిగే కార్యక్రమాలను, ప్రమాదాలను, సమస్యలను, వైరల్ అయ్యే వార్తలను ముందుగానే ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే జరిగే అనర్థాలను తగ్గించడానికి, అడ్డుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ పరిపాలనలో మీడియా స్ట్రాటెజీగా కౌంటర్ ఫాల్స్ ప్రోపగాండా, ఫీడ్ బ్యాక్ లూప్ ఫర్ ఇంప్రూవింగ్ గవర్నెన్స్, ఎడ్యుకేటింగ్ పబ్లిక్, బ్రాండ్ బిల్డింగ్ అంశాలను వివరించారు. కలెక్టర్లు, ఎస్పీలందరూ మీడియా, ఈవెంట్ మానిటరింగ్ టీమ్ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. 24X7 ఫీడ్ బ్యాక్ ఇచ్చేలా మెకానిజం తయార చేయాలన్నారు. వైరల్ అయ్యే వార్తలను వెంటనే నిర్ధారణ చేసుకోవాలన్నారు. అందరికంటే ముందుగా స్పందించాలని, ఈ విషయంలో సీఎంవో, ఐ అండ్ పీఆర్ లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఫలితాలు సాధించిన స్టోరీలను వెంటనే ఐడెంటిఫై చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈమేరకు ఏఐ టూల్ తయారు చేయడం జరిగిందన్నారు. ఇది గౌరవ ముఖ్యమంత్రి మానస పుత్రిక అని అభివర్ణించారు. ఏఐ టూల్ ఉపయోగించి మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ మేరకు ఒక డాష్ బోర్డును తయారు చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జూలై 17 నుంచి జూలై 28 వరకు రాష్ట్రంతో పాటు జిల్లాల వారీగా అన్ని శాఖల్లో జరిగే, జరుగుతున్న కార్యక్రమాలు, సమస్యలు, ప్రివెంటివ్ రిపోర్టింగ్ అంశాలను వివరించారు. వీటిని పాజిటివ్, నెగెటివ్, న్యూట్రల్ వర్గాలుగా వర్గీకరించామని తెలిపారు. దీనిపై ప్రభుత్వ సహకారంతో మరింత ముందుకు వెళ్లాలని యోచిస్తున్నామని స్పష్టం చేశారు.

# ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలి




## జిల్లా రెవెన్యూ అధికారి ఇంచార్జ్ శ్రీదేవి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఇంచార్జ్ శ్రీదేవి అధికారులకు సూచించారు. సోమవారం డిఆర్ఓ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బందర్ ఆర్డీవో ఎం వాణితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక– "మీకోసం కార్యక్రమం" నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పెనమలూరు మండలం కానూరుకు చెందిన అబ్దుల్ షాకిర తన భర్త ఇరిగేషన్ శాఖలో వాచ్మెన్ గా పనిచేస్తున్నారని, అయితే సరిగా ఉద్యోగ విధులకు హాజరు కాకపోవడం, కుటుంబం వద్ద ఉండకుండా వేరేచోట ఉండడం, కుటుంబ పోషణ కష్టంగా మారిందని, తన భర్త ఉద్యోగం తనకు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. పామర్రు మండలం జమీ గొల్వేపల్లి గ్రామానికి చెందిన కొల్లి గోపాలకృష్ణ తమ ప్రాంతంలో కొమరవోలు డ్రైనేజీలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో పొలాలు ముంపుకు గురవుతున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. బందరు మండలం బుద్ధాల పాలెం గొల్లగూడెం కు చెందిన చలంకుర్తి పాండురంగారావు తన కుమార్తెకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన 1.02 ఎకరాల భూమికి తన కుమార్తె పేరుతో పట్టాదార్ పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జిల్లాలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని, పెట్టుబడి సాయం అందించాలని, కౌలు రైతులకు సి సి ఆర్ సి కార్డులు అందజేసి రుణాలు మంజూరు చేయాలని, రైతు సేవ కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు అందించాలని కోరుతూ రైతు సంఘం ప్రతినిధులు మీకోసంలో అర్జీ సమర్పించారు. డిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ మీకోసంలో ప్రజల నుండి అందిన అర్జీలను గడువు దాటకుండా నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని, అర్జీ దార్లకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చు అర్జీలపై దృష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో కౌంటర్స్ ఫైల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సర్వే ఏడి మనీషా త్రిపాటి, ఆర్టీసీ డిఎం పెద్దిరాజులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు అందుకున్న 36 ఫిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాన్ కంట్రోల్ రూమ్ లో సోమవారం ఉదయం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 36 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ (జనరల్)డాక్టర్ ఏ మహేష్, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఆ సమస్య గురించి క్షుణ్ణంగా తెలుసుకొని ఆ సమస్య త్వరగా పరిష్కారం అయ్యేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుకున్న ప్రతి ఫిర్యాదును మూడు సర్కిల్లో ఉన్న జోనల్ కమిషనర్లు తమ తమ పరిధిలో నుండి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుకున్న 36 ఫిర్యాదుల్లో, అత్యధికంగా పట్టిన ప్రణాళిక విభాగానికి సంబంధించి 15 రాగా, ఇంజనీరింగ్ 8, ఎస్టాబ్లిష్మెంట్ 3, రెవెన్యూ,జెడి అమృత్, విఏ యస్, ప్రజారోగ్యం 2, యు సి డి, హార్టికల్చర్ చెరొక ఫిర్యాదులు వచ్చాయి. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్‌తో పాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నవళి, చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్ రావు, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి. జీ. ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి

## డీఆర్వో వి. శ్రీనివాసరావు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజాల నుండి స్వీకరించిన అర్జీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినప్పుడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యం నెరవేరుతుందని జిల్లా అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి జిల్లా రెవిన్యూ అధికారి వల్లభనేని శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా డీఆర్‌వో వి.శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోపు వాటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించడం ద్వారా అర్జీదారుల అభినందన అందుకోవడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చినవారవుతారన్నారు. క్షేత్రస్థాయి అధికారుల సమన్వయంతో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 140 అర్జీలు అందగా.. వీటిలో రెవెన్యూ-47, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి-20, పంచాయతీరాజ్-20, పోలీస్-14, ఏపీసీపీడీసీఎల్-3, డీఆర్‌డీఏ-3, డ్వామా-3, వైద్యఆరోగ్యం-3, సర్వే సెట్టిల్మెంట్-3, సహకార శాఖ-2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం-2, విద్య-2, గృహ నిర్మాణం -2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్-2, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల-1, బీసీ వెల్ఫేర్-1, సివిల్ సప్లై-1, కాలేజ్ ఎడ్యుకేషన్-1, ఉపాధికల్పన -1, దేవాదాయ-1, గ్రామ వార్డు సచివాయలు-1, ఐసీడీఎస్ -1, ఇరిగేషన్-1, రహదారులు-భవనాలు-1, గ్రామీణ నీటి సరఫరా -1, సోషల్ వెల్ఫేర్ -1, ఖజానా శాఖ -1, గిరిజన సంక్షేమం -1 మొత్తం 140 అర్జీలు స్వీకరించగా వాటిలో 79 అర్జీలను స్వయంగాను, 61 ఆన్లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందని డిఆర్వో శ్రీనివాసరావు తెలిపారు.



## తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు

**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** మండల తహసీల్దార్ గా ఎన్ సురేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రైతులకు ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి నన్ను కలవచ్చని రైతులుకి ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తానని ప్రజలకు రెవిన్యూ కార్యాలయంలో ఎటువంటి పని ఉన్న వెంటనే పరిష్కారం చేసే దిశగా పనిచేస్తానని ఈ సందర్భంగా అన్నారు. రెవెన్యూ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ రిబ్బికా రాణి సీనియర్ అసిస్టెంట్ సంధ్య ఆర్ఐ వేణు కుమారి జూనియర్ అసిస్టెంట్ తహసీల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. వీఆర్వోల ఆర్గనైజింగ్ సెక్రటరీ వెలగ శ్రీనివాసరావు డివిజన్ ప్రెసిడెంట్ కన్నెగంటి లీల ప్రసాద్ మండల అధ్యక్షులు కొల్లి నరేష్, విఆర్వోలు అందరూ తాసిల్దారును మర్యాదగా పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావు



**వత్సవాయి ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండల తహసీల్దార్ గా ఎస్ నరసింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్ యస్.నరసింహరావు ని గౌరవంగా కలిసి పుష్పగుచ్చం తో స్వాగతం పలికినారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో నందిగామ, నూజివీడు మైలవరం తిరువూరు, ప్రత్తిపాడు తదితర మండలాల్లో పనిచేయడం జరిగిందని రెవెన్యూ అధికారులు సిబ్బంది సహకారంతో ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన ప్రజలకు అందించడం అలాగే రెవెన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో డిప్యూటి తహసీల్దార్ మాడుగుల రవికుమార్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాణావతు సూరమ్మ వీఆర్వోలు కుక్కల సురేష్,పరమేష్,స్వామి, ఖాజా, సుభాని శ్రీనివాసరావు, అనిత, గ్రామ రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గన్నవరం తహసీల్దార్‌గా శివయ్య బాధ్యతలు



**గన్నవరం, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** గన్నవరం మండల తహసీల్దార్ గా శివయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. రైతులు, ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా వచ్చి కలవవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999